# పొరబాటు - అన్నయ్య!

[కథానిక]

= శ్రీ 'వెంచాశా' =

౧

సూదికూడా మోపటానికి వీలులేని క్రిక్కిరిసియున్న రైల్లో ఎక్కడంకన్న దిగడమే కష్టం అని చెప్పవచ్చు. దిగడంలో ఒక్కొక్కప్పుడు ప్రాణాలుకూడా పోతాయేమో అని అనిపిస్తుంది.

రైలు ఎక్కడికి తీసుకుపోతుందోకూడా తెలీని పరిస్థితుల్లో ఉన్నాం. రం—విడచి ఇప్పటికి రెండు రోజులైనా మేం ఏవూరూ చేరుకోలేదు. రైల్లోనే వున్నాం. అదైనా మాదేశంలోనే రైల్లో పోతూన్నా 'గరగర' శబ్దం వినవస్తూనేవుంది. కండ్లు పొడుచుకుని చూస్తే నీలమేఘాలు తప్ప ఏవీ కన్పించటంలేదు. నిబ్బరంగా చంద్రుడు ఇవ్వాళ బయటకు రాగలడా అనిపిస్తుంది. రైలుకూడా బెదుర్తూనే వెళ్తున్నది. ఒక్కరూ మాట్లాడటంలేదు. కొంతసేపు అయిన తరువాత శబ్దం వినిపించటం తగ్గిపోయింది. మాకు వాన కురిసి వెలిసినట్లుగా వుంది. దాంతో రైలుకూడా నెమ్మదిగా వెళ్తోవెళ్తో చప్పున ఆగిపోయింది. ఒక్కొక్కరూ దిగడం మొదలుపెట్టారు. ఒక్కుమ్మడిగా తిరణాలప్రజ అయిపోయినారు. మేం దిగినచోటు ప్లాట్‌ఫారంలాగే కన్పించింది. కొంతదూరం పోయి చూస్తే నల్లగా త్రాచుపాములు మెలివేసుకున్నట్లుగా అక్షరాలు కన్పించాయి. దాని మీద ప్రో—అని వ్రాసి వుంది. "అబ్బ! మనం ఇప్పటికి నూటడెభ్భై మైళ్లు ప్రయాణంచేశామన్నమాట" అన్నారు ఎవరో మాలో. నూతిలోంచి మాట్లాడినట్లుగా వుంది ఆతని గొంతుక. రైలు ఎక్కినప్పటినుంచి మానవుని స్వరం వింటం అదే మొదటి తడవు. రైలు చూస్తుండగానే వెనక్కు తిరిగి వెళ్లిపోయింది. మేం అట్లాగే శిలల్లాగా నిల్చున్నాం. ఎవరో అన్నారు—ఆయన నా అధికారిలాగే వున్నాడు. "ఇంకో రైలు వస్తుంది. ఇక్కణ్ణించి మరోచోటికి తీసుకుపోతుంది. కొంచెం కాచుకొక్కచోవాలి అది వచ్చేంతవరకు. ఇంతట్లో భోజనాలు చేసేవాళ్లు చెయ్యొచ్చు. అక్కడే 'పైపు' లున్నాయి మంచినీటికి" అని.

మేం ఏం తెచ్చుకున్నామో ఏం తెచ్చుకోలేదో అప్పటికి చూసుకున్నాం. నావిషయం చూస్తే నడవటానికి కూడా చాలా బరువుగా వుంది. నా వీపుకు ఒక పెద్ద సంచీ వంటిది వుంది. దాంట్లో ఏమేమి ఉన్నాయో తెలియదుగాని చాలా బరువుగా వుంది. కుడి చేత్తో ఒక టిన్ పట్టుకున్నాను. నా వెనకాత్తే 'బాబా' వస్తున్నాడు. ఆయన దగ్గిరా ఏవేవో ఉన్నాయి. మా 'అమ్మి' చేతుల్లో మటుకు ఏవీ లేవు. ఆమె ఎందుకో దిగులుపడ్తూ వస్తున్నది. "గోడా గేదే పోతేపోయింది. ప్రాణాలు దక్కించుకున్నాం. అంతే చాలు" అన్న సంతోషం, తృప్తి ఆమెలో వున్నాయనీ ఆమెముఖకవళికలను బట్టి అనలేం. అడుగులో అడుగు వేసుకుంటూ వస్తున్నది. మా బరువు లన్నీ దింపుకుని ఆకసం వంక చూస్తూ ఆ చెట్టుకింద కూచున్నాం తాపీగా. పొరలుపొరలుగా విడిపోతున్నాయి మేఘాలు. 'బాబా' సంచీలోకి 'దాల్' వరగపోస్తూ అన్నాడు: "పోయి మూడు రాళ్లు తీసుకు ర" మ్మని. నాకు రాళ్లు దొరకలేదు సరి కదా భయంకూడా వేసింది అవతలకు వెళ్లటానికి. ఇనుప కమ్మి లవతల అంత గాఢాంధకారంగా వుంది. "అక్కడ గుంటే వుందో మిట్టే వుందో ఎట్లా అక్కడికి వెళ్లటం—"అప్రయత్నంగానే అనేశా బయటకు. నా కెవరో తిరుగుజవా బిచ్చినట్లుగా వుంది—"మేం ఇప్పుడే చేలాంతరు వెలిగించి అక్కడకు వెళ్లి

చూసి వచ్చాం. దట్టంగా గుములుకుని చెట్లున్నయి. అంతే. రాళ్లుకూడా అక్కడక్కడ వున్నా" యని. మనిషి కనపడకపోయినా గొంతును పట్టి ఆమాట్లాడినది ఎవరో స్త్రీయే అని అనుకున్నా. ఆపళంగానే నాకు చాలా సిగ్గు వేసింది. నాకు మనస్సు నిలకడలేదు. తొందరపడి భయపడ్డానని నాలో నేను సమాధాన పరుచుకున్నాను.

'బాబా' ఇంత ఆలస్యంగా వచ్చావేమని కోప్ప డకపోయినా నిప్పుపుల్ల గీసిన వెలుతుర్లో ఆయన ముఖాన్ని చూసే నొచ్చుకున్నాను. ఆయన రాళ్లు అమ రుస్తూ అన్నాడు: "వెధవ పుల్లలు దమ్ముకు న్నాయి" అని. పైప్‌దగ్గరకు వెళ్లి 'టిన్' లో నీళ్లు పట్టుకువచ్చి నాపని నేచేశాకదా అని కూర్చున్నా పొయ్యిదగ్గరే మంటవైపు చూస్తూ. కనురెప్పలు పెర పెరలాడినట్లుగా మండుతూవుంది పొయ్యి. మా 'బాబా' వంట చేస్తా డని నేనెప్పుడూ అనుకోలేదు. 'అమ్మి' దిగుల్తోనే కూచున్నది చెట్టు నానుకుని. నిమి షంలో వంట చేశాడు. వండిన బియ్యం, దాల్ కలుపు కుని తిని 'పైప్' నీళ్లు త్రాగి మా ఆకళ్లు తీర్చుకున్నాం అనిపిచ్చాం. ముందుముందు ఇదికూడా దొరికి ఇట్లా తింటంకూడా అసంభవం అన్నాడు బాబా నాతట్టు చూస్తూ. అలవాటుపడ్డవాడుకనుక 'తమాఖు' కోసం జేబు తడువుకున్నాడు. మళ్లీ ఏం మాట్లాడకుండానే తనూ ఒకవైపు చెట్టుకు ఒరిగి కూచున్నాడు. "నిద్రా నిప్పులూ లేవూ ఇహ" అందా మనుకున్నా. 'బాబా'ను చూసి మరింత భయపడ్డా. 'అమ్మి'కి దిగులు పోయి మామూలుమనిషి అవుతుం దని నమ్మకం నాకే లేదు. నే నట్లాగే 'ఖారా' నెమరేస్తూ చిన్న రాతిగట్టుమీద కూచున్నా. ఆకాస్తలోనే వీలు చేసుకుని కన్ను మూశాడు 'బాబా'. 'అమ్మి' మేలుకున్నా నిద్ర పోయినట్టుగానే వుంది. ఇహ నే నొక్కణ్ణి. భయం లేకపోయినా గుబులుగుబులుగా వుంది. నేను ఇట్లాగే కూర్చుని తెల్లవార్చాలకామాల్సు అనుకున్నాను. నిద్ర పోయినాడే అని 'బాబా'మీద నాకు ఇంతవరకూ వుంది. 'ఖారా' మరింత వేగం నమలటం మొదలు పెట్టాను. అమ్మికి కొంచెం దగ్గరసా కూర్చున్నా, 'అమ్మి'ని పలకరించటానికి మనస్కరించలేదు. కోడి కూతలూ అవీ ఏం లేవుగనుక తెల్లవారిం దనే భ్రమతో 'బాబా'ను లేపాను.

నానోట్లో ఖారాను చూసి "నీవు రాత్రినించి నిద్రపోలేదా" అన్నాడు 'బాబా'. నే నేమీ మాట్లాడ లేదు.

తెల్లవారుతూనే రైలు వచ్చింది. సంచీ మళ్లీ మామూలుగా వీపుకు కట్టుకున్నాను. 'అమ్మి' అతి కష్టంమీద ఎక్కింది. ఆ మెదిగులు ఎప్పటికి తీరుతుందో తెలియదు. అందరూ ఎక్కేంతవరకూ ఆగింది పాపం రైలు. టిక్కట్టు 'బాబా'యే కొని తెచ్చాడు. ఇదివరకు ఉన్నంత నిశ్శబ్దంగా లేకపోయినా జనంలో గుసగుసలు బయలుదేరుతున్నయి. ఈరైలు ఎక్కడికి తీసుకుపోతుందో అని భయపడుతూ ఛలికి వణుకు తున్నారు కొందరు. ఏదో ఒక స్టేషనులోనే తప్పక ఆగుతుం దని తెలుసునుగనుక ఈసారి అంత ఆదుర్దా పడలేదు. కొంచెం తొందరగానే పోవటం మొదలు పెట్టింది ఎందుకనో. దానికీ భయం తీరినట్టుగా వుంది. మా కింకా ఆకలి బాగా కాలేదు. స్టేషను వచ్చింది. నేను మళ్లీ పేరు చదివాను. టాం—అని వుంది. ఇది మొదట చూసిన స్టేషనంత పెద్దదిగా లేదు. ఇక్కడ మటుకు దిగడం కొంచెం కష్టమనిపించింది. నేనూ, 'బాబా' పట్టి దింపవలసివచ్చింది 'అమ్మి'ని. దిగి అందరూ బారులు తీర్చి నిల్చున్నారు. పోయినసారి వచ్చిన అధికారిగాని, అటువంటివాడుగాని వచ్చి ఏమైనా చెప్తాడేమో అనుకున్నా. ఎవరొచ్చినా అటునుంచి ఇటు ఆయనమాదిరిగానే కనపడేవాడు.

"ఇంక రెండు మైళ్లుమాత్రం నడవాలి. ఆపయిన మళ్లీ ఫరవాలేదు" అన్నాడు ఆవూరి స్టేషనుమాస్టరు. నడవటంమాట అనేటప్పటికి నా కెందుకో 'ఉషారు'గా వుంది. వళ్లు జలదరించి గుండె 'కీ' మంది.

"అమ్మిచెయ్యి పట్టుకో ముందర" అని 'బాబా' కోప్పడ్డట్టుగా వుంది. నేను వెనక్కు వెళ్లి అట్లాగే చేసి నడవటం ఆరంభించాం.

ఆరెండుమైళ్లూ ఎట్లాగో నడచివచ్చి కూచు న్నాం. ఒక చిన్న నది వంకలువంకలుగా తిరిగి ప్రవ

హిస్తూ పోతున్నది. "అది దాటాలి. అవతలకు పోయిన తరువాత మళ్లీ ప్రయాణంచేయాల" అన్నారు. నా గుండె ఎందుకో 'గతుక్కు' మని బాబాతో అన్నాను- దీనిని దాటడ మెలాగునని. అందరూ ఎట్లాగో మనమూ అట్లాగే అని సమాధానం ఇచ్చాడు. నే ననవసరంగా ఘాబరాపడటం చూసి అందరూ నవ్వుతారేమో అనిపించింది. కొంచెంసేపయినతరువాత మూడు 'స్టీమ్‌లాంచీ'లు వచ్చాయి. ఆ మూడిట్లో పట్టినంతమంది ఎక్కాం. అది అటూ యిటూ వరిగిపోతుంటే నాకు పరీక్ష తప్పినంత దిగులు పుట్టింది. అక్కడకూడా 'అమ్మి'ని చెరొక రెక్క పట్టుకున్నాం. అవతల ఒడ్డుకు వెళ్లినతరువాత ఒక్కొక్కరికి పదణాలు అడిగాడు. ఈ కాస్తదూరానికి పది అణాలు అనవసరం అని నేను పోట్లాడినా లాభం లేకపోయింది. 'బాబా' జేబులోంచి డబ్బు తీసి యిచ్చాడు.

మేం ఇవతలకు వచ్చాం. ఇవతలకు వచ్చిన తరువాత మేం తెలిసి చేయదగ్గ పని కనిపించలేదు. ఎదురుగ్గా రాక్షసులల్లే కన్పిస్తున్నాయి కొండలు. 'బాబా' వంటచేస్తా నన్నాడు అక్కడే ఒకమూల. కాదని అనటానికి నోరు ఎవరికీ రాదుగనుక (అప్పటికి నాకు ఆకలి బాగా అవుతున్నది) నేనూ ప్రశ్నార్థకంగా 'అమ్మి' తట్టు చూశాను. ఒకసారి వంట చెయ్యటం అనుభవమేగనుక ఈసారి అంత కష్టమని అనిపించలేదు. ఇక్కడ పైపులేవీ కనపడకపోతే ఆ నదిలోవే నీళ్లు 'టిన్'లోకి పట్టుకున్నాం. కులాసాగానే ఆపూట అక్కడ గడిపి ముందున్నాయి గనుక కష్టాలు ఏవో ఆలోచించుకుంటూఅక్కడేకూచున్నాం. నేను పట్టుదలగా అక్కడ పచ్చగడ్డిలో తెల్లటిగుడ్డ పరుచుకుని నిద్రపోయినా.

"అయిపోయింది. ఇంకేముంది. కొండలు వచ్చాయి. కొండ దాటితే కొత్తదేశానికి పోవచ్చు. ఆ తరువాత గమ్యస్థానంవిషయం ఆలోచించవచ్చు" అని అన్నారు కొందరు అప్పుడే కొండ ఎక్కి దిగినట్లుగా......కొంద రంటారు—"దిక్కూ దివాణం తెలియదు. ఎన్ని కొండలు దాటాలో, వాటికి దోవలు ఎక్కడున్నాయో అవన్నీ మన కేం తెలుసును? చెప్పేవా రెవ్వరూ లేరు" అని. దాంతోటి ఇరుపక్షాల వారుగా తేలారు. బాబా మెదలకుండా కూర్చుని వింటున్నాడు. నా కీగోడు ఏమీ అర్థంకాక ఎదటబడి తాగితే మరీ బాగుండదని అవతలకు వెళ్లి సిగిరెట్టుపీక వెలిగించాను. "ముష్టికొండలు ఎన్నిరోజులు పడ్తాయి. రెండురోజుల్లో అవతలికి చేరుకోవచ్చు" అని ధైర్యం చేసి ముందంజ వేశారు కొందరు. వారితోపాటు మరి కొందరు. అట్లాగే అసలు మొట్టమొదట అక్కడనుంచి వచ్చినవారిలో సగంపైగా బయలుదేరారు. 'బాబా' ఎందుకైనా మంచిదని కదల్లేదు. నాపని ముగించి బయటపడి 'బాబా' ముందు వచ్చి కూచున్నా. మీసాలు దువ్వుకుంటున్న బాబా లేచి "మనం ఈపూట ఇక్కడ వుందాం. ఎందుకైనా మంచిది. మర్నాడు బయలుదేరి పోవచ్చు" అన్నాడు. అయినా బాబా నాఅభిప్రాయం అడగడమేమిటి?...... ఎట్లాగో ఆపూట అక్కడ వంట పెడతా డని నాకు తెలుసు. అదివరకు తెచ్చినవే ఆపూటకుకూడా వున్నాయి 'దాల్'తోసహా.

భోజనాలు చేసినతరువాత 'బాబా' నా కోసం గతి జ్ఞాపకంచేశాడు. "మనకు కావలసినంత ఆహారం లేదు ప్రయాణానికి. చాలాదూరం పోవలసివుంటుందేమో. మనం కూడా తీసుకునిపోతే మంచిదేమో" అన్నాడు. మొదట్లో ఖాళీచేసి వచ్చేటప్పుడు 'పర్సు' నాచేతికే ఇచ్చి దాచిపెట్టమన్నాడు. ఉన్నదో పోయిందో అని లాగుజేబులోకి భయంతో చూసుకున్నా. అంతకుముందే ఒక టిన్‌లో కావలసినంత 'దాల్' వుంది. ఇంక కావలసింది బియ్యమేగనుక ఊళ్లోకి రెండుమైళ్లు వెళ్లి తెచ్చాడు. తెచ్చినపుడున్నంత 'ఉషారు' తీసుక వెళ్లటం విషయం ఆలోచించేటప్పటికి-అది లేకపోంగా దిగులుకూడా పుట్తున్నది. నే నో మంచి ఉపాయం చెప్పాను. దానిబదులు రెండురోజులకు సరిపోయే రొట్టెలు ఇక్కడే చేసుకునిపోతే బియ్యం మనం ఇన్ని మొయ్యక్కర్లేదు అని. ఫరవాలేదు నాకే మంచి వుపాయంగా తోచింది. మా 'బాబా' ఏమంటాడో అని ఆయనతట్టు చూశాను. మేం తెచ్చిన బియ్యంలో ఇంకోరికి సహం ఇచ్చి మిగతావి మోసుకుపోవటానికి సిద్ధపడ్డాం.

కొండ ఎక్కటం మొదలుపెట్టాం. నాకు చాలా 'హాయి' అనిపించింది మొదట్లో. ఉన్న బరువులో సగం పైగా నాదగ్గర వున్నా. అన్నీ నావీపుకు తగిలించిన సంచీలోనే వున్నాయి. మెట్లు అంటూ ఆట్టే లేకపోయినా అంత కష్టమనిపించలేదు. కాని కొంతదూరం వచ్చి పక్కకు తొంగిచూశాను. ఇంకేముంది అయిపోయింది అనుకున్నా. నే నెక్కడ వున్నానో నాకే తెలియలేదు ఆకాసేపు. అంత అగాధమైన లోయ. ఎంతసేపటికీ కళ్లు ఆవైపుకు పోకుండా ఉంటే బావుండురా అనిపించాయి. అట్లా అనుకున్నా నన్నమాటే గాని చూడకుండా వుండబుద్ధిపుట్టేది కాదు.

అందరూ నడుస్తుంటే నే కాసేపు కూర్చునేటప్పటికి న న్నెవరో అడగనే అడిగారు చిరునవ్వు నవ్వుతూ—"ఏం ఆకొండలోయల్ని చూసి భయపడ్డట్టున్నా"రని. ఒకసారి విన్న గొంతుక కనుక ఇది, సమాధానం సిగ్గుపడకుండానే చెప్దా మనుకున్నా. "వంట్లో సరిగ్గా లేదు. పైత్యమే చేసిందో, పాడే చేసిందో. అందుకని కళ్లుతిరుగుతుంటే కాసేపు 'రెస్ట్' తీసుకున్నట్టుగా వుంటుందని కూచున్నా" అన్నా. ఆ అమ్మాయి అదివరకునుంచీ మా పక్కనే వస్తున్నది. అప్పటినుంచి ఇప్పటివరకు ఏం మాట్లాడలేదు. అప్పుడప్పుడు 'తనలో తను' చిరునవ్వు నవ్వుకోటం మటుకు చూశాను. మాట్లాడదామని వుందికాని లోపల- ఏమని పలకరిస్తే బావుంటుంది అని ఇందాకటినుంచి ఆలోచిస్తూనే వున్నా. ఇట్లా వుండంగా ఈపని జరిగింది. 'బాబా' పెద్దమనిషితరహాగా అన్నాడు: "అమ్మాయి, చూడు, మావాడు శత్రి — పిటికివా డని చెప్పాలో ఏమని చెప్పాలో తెలియటం లేదు. అటువైపు చూడవద్దురా అంటే వినడు. ఇంకా చిన్నపిల్లల చేష్టలు పోలేదు మావాడికి" అని. అట్లా ఆయన అన్నప్పుడు నే నెవరితట్టూ చూడలేదు. నన్ను నేనే చూసుకున్నాను ఆపరిస్థితుల్లో. ముసలివాళ్లకు ప్రపంచ జ్ఞానం తక్కువ అని అనుకున్నా ఆతల వంచుకున్నపుడే. ఎవ్వరం మాట్లాడకుండానే మాదోవన మేం సాగిపోతున్నాం. నేను 'బాబా'మీద కోపం వచ్చినట్లుగా మూతిని పెట్టి సాగిపోతున్నా. (అది నటన అని చెప్పటానికీ వీలులేదు. తాత్కాలికమేమో.)

ఆ అమ్మాయి కొంచెం సే పున్నతరువాత "నాకు మంచినీళ్లు కావాలి" అని అడిగింది. ఎవరిని ఉద్దేశించీ అడగలేదు. నేను బాబాతో అన్నాను.— "బాబా, అమ్మాయి మంచినీళ్లు అడుగుతున్నది, ఇవ్వనా" అని.

"నీ మొఖం! 'అమ్మాయి' ఏవిటీ, 'ఆవిడ' అనలేవూ? నన్ను అడగాలా, ఇవ్వాల్సిందీ ఇవ్వక్కర్లేందీ నీకు తెలీదా" అన్నాడు. నన్ను మరింత ఇరుకున పెట్టినవా డయాడు బాబా. ఏం చేయటానికీ తోచక అమ్మాయితట్టు చూస్తే బావుండదేమో నని మెదలకుండా వూరుకున్నా.

"అబ్బ! కాళ్లు పీక్కుపోతున్నాయి. దాహం వేస్తున్నది."—మళ్లీ వినపడ్డది.

"ఏవిటీ, మనల్ని అడగడ మేవిటి, ఎవరి నీళ్లు వాళ్లు తెచ్చుకోక్కర్లేదూ—ఈమె మనవెంటబడ్డదేం? వాళ్లవాళ్లు ఎవరూ లేరా" అని ఆమె ఎదటే అందా మని అనుకున్నాను.

ఈలోపల్నే 'బాబా' టిన్‌లోంచి 'లోటా' లోకి పోసి నాచేతి కిచ్చా డివ్వమని.

అడుగడుక్కీ అనుమానమే. ఆమెచేతి కివ్వాలా, లేకపోతే ఆ కొండరాయిమీదనే పెట్టాలా ?

ఆమె నా చేతిలోదే బలాత్కారంగా తీసుకోకపోయినా అడిగి తీసుకుంది. తాగి, మళ్లీ నాకివ్వబోతూ మూతి తుడుచుకుంటూ నాతట్టు చూసి నవ్వుమొగం పెట్టింది.

"మీరు చాలా శ్రమపడ్డారు. డబ్బివ్వనా" అంది.

"అమ్మ! మంచినీళ్లివ్వటానికి శ్రమ ఏమిటి? పిచ్చిపిల్లలా గున్నావ్!" అన్నాడు బాబా.

"నన్నా మొదట్లో కోప్పడ్డాడు. ఈమెనూ ఇప్పుడు అంటున్నాడు. సరిపోయిందిలే" అనుకున్నా.

"అమ్మ, నీవెవరు? వంటరిగా వస్తున్నావ్. బంధువులు ఎవ్వరూ లేరూ" అని అడిగాడు బాబా.

ఈప్రశ్నే మొదట్లో నే నడగా ల్ననుకున్నాను. కాని దానికి సమాధానం తన నోటిమీదిగా ఏమని చెప్తుందో, ఎట్లా చెప్తుందో అని నాకు చాలా

కుతూహలంగా వుంది. వేగంగా నడుస్తున్న నడకను తగ్గించాం. ఆమె వుండీ వుండీ..."నన్న మీ అబ్బాయిగారికి బాగా తెలుసు. ఆయన్నే అడగండి" అని సూక్ష్మంగా నవ్వుతూ అన్నది. "ఈమె కేమన్నా పిచ్చెక్కిందా...ఎప్పుడూ నవ్వుతూ మాట్లాడుతుంది. ఒకమాటకు ఒకమాటకు సంబంధం లేదు. అమ్మాయిని నాకు బాగా తెలియటమేమిటి"అన్నాను బాబాతో. అనేటప్పుడు కొస్త రోషంతోనే అన్నాను ఆమెకు బాగా కోపం తెప్పిద్దామని. దాని కెప్పుడూకూడా వ్యతిరేకంగానే జరుగుతోంది. కోపం అణుమాత్రమైనా లేకుండా ఇప్పుడు కొంచెం బయటకు నవ్వుతూ అన్నది—"ఆమాటలన్నీ అబద్ధం అని నేను చెప్పగలను" అని.

"అసలు నీ వెవరో నాకు తెలియదు. నిన్నెప్పుడూ చూడలేదు. వట్టి అబద్ధపుమాటలు కూస్తున్నావ్" అన్నాను.

"మీ మాటలు విన్న కొద్దీ నాకు నవ్వు ఎక్కువగా వస్తున్నది. క్షమించాలి" అన్నది.

ఇదంతా చూసి అమ్మి నామీద ఎంతగా కోప్పడ్తుందో నని ఆమె కట్టు చూశాను. కొంచెం ఆమెదగ్గరకుకూడా వెళ్లాను.

'జిన్నా!' అని పిలిచి చెప్పింది. "అబ్బాయి! ఏవిటో తొక్కాను. కాలు కొంచెం నొప్పిగా వుంది" అని.

"మేం ఏవీ తొక్కలేదే, నీ వెట్లా తొక్కావు? అయినా ఈచుట్టుపక్కల్లో ఏవీ చూడలేదే" అన్నాను.

నామాట విన్నదో లేదో కూడా, నా చేతుల్లోకి వరిగిపోయింది. పెద్దగా కేక పెట్టి 'బాబా'ను పిలిచాను. అసలువిషయం ఏమై వుంటుందోకూడా ఊహించుకో లేక పోయినాను. ఆయన వచ్చి ముఖంమీద చల్లనీళ్లు చల్లాడు గట్టిగా...'అమ్మి... అమ్మి' అని రెండుసార్లు పిలిచాడు. చాలాసేపు పిలిచినా పలుకలేదు. ఆమెకూడా మా గుంపులోకి చొచ్చుకునివచ్చింది సిగ్గూ, బిడియం ఏవీ లేకుండా. ఆమెచెయ్యి నాచెయ్యికి బాగా తగుల్తున్నది. నే సిగ్గుపడి నాచెయ్యి వెనక్కు తీసుకున్నా ఆమె మరీదగ్గిరికి వచ్చి—"ఏమన్నా పురుగు ముట్టిందేమో చూడండి ... ఒక చిన్న గుడ్డపీలిక వుంటే ఇవ్వండి, సరిచేస్తాను". అటూ ఇటూ నాలుగు వైపులా చూసింది. నాబుజంమీద 'తువ్వాలు' వుంది. అది తీసి ముక్క చింపింది నే చూస్తూవుండగానే. నాకు చాలా కోపం వచ్చింది. ఏం చేయలేక వూరుకున్నాను. "నాదగ్గర ఇంత స్వతంత్రంగా వ్యవహరిస్తున్నది. లేనిస్వతంత్రం ఎక్కణ్ణించి వచ్చింది ఈమెకు? ఈమెవ్యవహారం అంతుబట్టటంలేదు నాకు" అని పరిపరివిధాలఆలోచించాను. ఆ చించినగుడ్డపీలికను కాలికి గట్టిగా బిగించింది. నేను మా అమ్మికళ్లవైపు చూశాను. కళ్లల్లో ప్రాణం వుందని నాకు తెలీదు. ఎవ్వరి చేతుల్లోనూ నిలవక కిందికి వరిగిపోయింది. నేను ప్రాణం పోయిం దనుకుని ఆమాట బయటకు అనవచ్చునో, అనకూడదో అని తెలియకుండా(ఇరవై ఏళ్లై నాకూడా) "బాబా! 'అమ్మి' చచ్చిపోయింది" అన్నాను. మా'బాబా' మా అమ్మను టూకీగానో, ఎంచేతనో 'అమ్మి' అని పిలుస్తాడు. మాఅమ్మఅసలు పేరు 'ఖుల్స్యాంబీ'. ఆపేరు నా కిప్పటికి జ్ఞాపకం వచ్చింది. పలుకరిస్తే మాట్లాడలేదు. చచ్చిపోయిందనే అనుకున్నారు. ఆమెకూడా బాబాతో తాత్సారంగా అంది—"ఇహ మాఅమ్మ నాకు లేదన్నమాట"

౨

మా అమ్మ చచ్చిపోయి అప్పుడే రెండురోజులైంది. ఎట్లా నడుస్తున్నామో మాకే తెలియటం లేదు... అప్పుడే మాఅమ్మవిషయం మఱచినట్లుగా వుంది. ఆమె విషయం వచ్చి నన్ను మఱపింపచేసింది నిజంగా. చాలాదూరం వెనక్కుపోయి ఆలోచిస్తున్నాను. నాకేమీ తట్టటంలేదు. ఆమె ఎవరయిందీ జ్ఞాపకంరావటం లేదు. అబ్బ! ఏవిటో కీచుమని అరుస్తున్నయికూడా. మిట్టమధ్యాహ్నం మల్లే వున్నాడు చంద్రుడు. చెట్టుకింద పచ్చగడ్డిలో పడుకున్నా నన్నమాటేకాని నిద్రపట్టటంలేదు. బాబా చక్కగా నిద్రపోతున్నాడు పచ్చటిగడ్డిలో. నా కెంత

నేపటికీ 'పురుగుముట్టిన' విషయం జ్ఞాపకానికి వస్తున్నది. నాకళ్లఎదుట అటూ ఇటూ మెదుల్తూనేవుంది. ఈరాత్రి ఎట్లాగో కన్నుమూస్తే రేపు పొద్దుటికి మళ్లీ ప్రయాణం చెయ్యొచ్చు. ఆమె కొంచెం నాదగ్గరగా వచ్చి మోచేతిమీద పడుకుని—"ఏం ఇంకా నిద్రపట్ట లేదా" అంది.

"నిద్రపట్టిందికాని నీపిలుపుకు లేచాను. అనవసరంగా నిద్రాభంగం చేశావ్" అన్నాను కసిరినట్టుగా.

"ఎట్లా నిద్రపట్టుందీ ఈ మహాభయంకరమైన కొండల్లో చెట్టుకింద—పురగు పుట్ర..." అంది.

"మాలో వచ్చి పడుకున్నావ్—భయమా నీకు కూడా?"

"నీవు అన్నయ్యవుగనుక నీదగ్గరకు వచ్చాను. నాకెవరూ లేరుగా మరి?"

"అమాటే అనద్దని చెప్పాను...నీ వెవరో నేనెవరో! రెండురోజులక్రిందట పాపంకదా అని మంచి నీళ్లు అడిగితే ఇచ్చాం—"

"నీవిట్లా కోపగించుకుంటావని నాకుముందుగానే తెలుసు. ఇప్పుడు బాబాను లేపి చెప్పనా?"

"నే నేం చేశా నిప్పుడు? ఆయన్ని లేపటం ఎందుకు? నన్ను కోప్పడతాడు. మెదలకుండా వూరుకో. నీ వొక రాక్షసికిమల్లే భయపెడుతున్నావే. అన్నయ్యా అని నా వెంబడి పడుతూంటివి— నీ కిక ఎవరూ అబ్బా అమ్మ అన్నా లేరూ, నేనేనా దొరికింది?"

"నీ వొక్కడివే అన్నయ్యవు ... ముద్దొస్తున్నావు గనుక అన్నయ్యా అని పిలవబుద్ధి అయింది. దానికి నీవు కోప్పడితే ఇంకోవిధంగా పిలుస్తాను. అన్నయ్యవు గనుకనే ఇంత చనువుగా మాట్లాడుతున్నాను."

"————"

"అన్నయ్యా, మనకు మంచినీళ్లు అయిపోయినయికదా. రేపటికి ఎట్లాగూ?"

"ఆ సంగతి నీ కెందుకు? మా అవస్థ మేం పడతాం."

"చూశావూ, నిన్న మనం దారిలో వచ్చేటప్పుడు ఎంతమంది చచ్చి:పడివున్నారో... నేను చాలామందిని లెక్క పెట్టూవచ్చానుకూడా."

"ఆసంగతి ఎత్తద్దు... నిన్న చీకట్లో నడుస్తుంటే కాలికి ఏదో మొద్దువలె తగిలింది. క్రిందికి చూస్తే శ-వ-ం. నేకూడా శవాన్ని అయిపోతానేమో అనిపించింది..."

"ఆశవం జుట్టు విరేబోసుకుని వుంది. మొహం కూడా పాలిపోయింది. నాలిక పీక్కుపోయింది. మనకన్నా ముందు వచ్చిన జట్టీలోవాళ్లు వీళ్లు. ఆహారం సగందూరం వచ్చేటప్పటికి అయిపోయింది. ముందుకు పోవాలన్నా వెనక్కు పోవాలన్నా ముందు కడుపు నింపుకోవాలి... నీళ్లు ఎక్కడున్నదీ వాళ్లకు తెలియదేమో. కొండల్లో నీళ్లు ఎక్కడ వుంటయి—"

"మనకుమటుకు ఎక్కడనించి వస్తయి? మనం అందరం చచ్చిపోతాం..."

"అన్నయ్యా, మేం చచ్చిపోతే పోతాంగాని నీవుమటుకు..."

"నేబ్రతికుంటే ఏం లాభం,...నే నొక్కణ్ణీ పోగలనూ?"

"నే నొక తమాషా చెయ్యనా ఇప్పుడు... అయ్యో...అని పెద్దగా అరుస్తాను. బాబా లేస్తాడు, నిన్ను కోప్పడ్తాడు. అప్పుడు నీపని ఏమవుతుంది? నేను అవీ ఇవీ కల్పించి చెప్తాను..."

"ఏం చేస్తాను? ఏడుపు వస్తే—స్తాను."

"చూశావా, మాఅన్నయ్య ఎంత భయంగిల మనిషో" అంటూ నాచేతిని ముద్దుపెట్టుకుంది.

నాకు ఉమ్మేద్దామా అనిపించింది. అసలు ఈమనిషికి పిచ్చి ఎక్కింది. లేకపోతే ఈచేష్టలు ఏవిటీ...వదిలించుకుందామని చూస్తే వీలుకావటం లేదు.

"నిద్రపోకుండా మేలుకున్నావేం, రేపుప్రొద్దున మళ్లీ నడవద్దూ, ఆయాసం కదూ" అన్నాను.

నన్ను పట్టుదలగా నిద్రలేకుండా చేసింది. రాత్రిపూటకూడా ఘోషా ఎందుకో? ముఖానికి గుడ్డ కప్పుకుంది. (తెర) అసలు దారిపొడుగూతా అంతే. మా బాబాకుకూడా ముఖం చూపించలేదు.

తెల్లవారింది. బయలుదేరేముందు నీళ్ల హెచ్చరిక చేశాను నేను. అదీ అప్పటికి సమస్యే అయిపోయింది. మేం అందరం ఆలోచిస్తూవుంటే ఆమె తన కక్కర్లేదన్నట్టుగా ఎటో చూస్తున్నది.

అప్పటికీ ప్రజలలో చాలామంది గుంపులుగా ఒకమూలకు పరుగెత్తుతున్నారు. కొందరు ఎటునైపు వెళ్లాలో...'ఊటనీరు ఊటనీరు' అని చెప్పుకుంటున్నారు. బాబా 'టిన్' తీసుకుని నన్నుకూడా వెళ్లమన్నాడు. ఆగుంపుల్లో చాలామంది ఆడవాళ్లు. ఒక్క రాయిమీద నిల్చుని నీళ్లు పట్టుకోవాలి. రాయి జరిగితే? ఎట్లాగైనా భయమే. అక్కడ జనం నెట్టుకుంటున్నారు. ఇంతమందికీ కలిపి ఆనీళ్లే.

"ఆడవాళ్లలోకి పోవటం అంత భయమైతే నే పట్టుకువస్తాను నా కివ్వండి" అని ఆమె తీసుకుంది. కూడా నీవు వెళ్లమని నన్ను పంపించాడు బాబా!

అక్కడికి వెళ్లి నీళ్లు పట్టుకువచ్చి "అన్నయ్యా, ఇదిగో తీసుకో. నాచెయ్యి చాలా బరువుగా వున్నది" అన్నది. నే తీసుకున్నాను. ఆమె నావెనకాత్తే వస్తున్నది. నీళ్లు మేం అక్కడే తాగాంకూడా.

ఆమె అన్నది: "అన్నయ్యా, ఇప్పుడు బయలుదేరితే సరిగ్గా రెండురోజులు — అంటే కనీసం రేపు సంధ్యవేళకన్నా చేరుకోవచ్చు. ఎంత త్వరగా బయలుదేరితే అంత మంచిది" అని.

నాదగ్గర చాలా బరువు లున్నయి. వాటిలో సగమేనా తగ్గిపోతేగాని నడవలేం. అసలు అన్నిటికన్నా బరువైనవి పుస్తకా లున్నాయి. వస్తూవస్తూ అన్నీ వదిలిపెట్టిరాగలిగానుకాని ఎందుకో అవిమాత్రం వదిలిరా బుద్ధిపుట్టలేదు. అన్నీ డబ్బుపెట్టి కొన్న పుస్తకాలని కాదుకాని ఎందుకనో పుస్తకాలను చూస్తే నా కంత ఇది. డబ్లీస్టాంపుభూగోళం, షేక్స్పియర్ నాటకం ఇంకా ఎన్నో పుస్తకాలున్నయి. చాలామందిని అడిగాను ఎవరన్నా ఒకొక్క పుస్తకం తెస్తారేమో. అడిగితే ప్రతివాడూ నిరాకరించాడు. అసలు కట్టుకున్న గుడ్డలు మొయ్యటమే చాలా కష్టంగా ఉంది. నల్లగా మురికిపట్టి చాలా బరువుఎక్కనై. అయ్యో! ఇవన్నీ పారేసిపోవలసిందేనా అనుకున్నా. ఆ చెట్టుదగ్గర పడేశా. తల్లీ నీవన్నా చదువుకో. అప్పుడు నాకు ఎంతో ఏడుపు వచ్చింది. ఆమె అన్నది: "బతికి బయటపడ్డాం, అంతే చాలు. ఆపుస్తకాలు ఎప్పటికైనా కొనుకోక్కవచ్చు. నీవు త్వరగా నడు అన్నయ్యా!" అని.

పుస్తకాలేకాకుండా ఇంకాకూడా తెచ్చాను. సామానులో కొంతభాగం అక్కడే పారేసి బయలుదేరాం.

"మనం అందరం ఏదో మాట్లాడుకుంటూపోదాం. ప్రయాస అనిపించదు అప్పుడు. మొట్టమొదట ఏదన్నా మొదలుపెట్టిచెప్పు నీవు. ఆతరువాత బాబా చెప్తాడు." అన్నాను నేను.

"నీవే ఏదన్నా మొదలుపెట్టు అన్నయ్యా—కాదంటే నే చెప్తాను."

"ఊ. మొదలుపెట్టు. ఇటువంటి సమయంలో సిగిరెట్టు వుంటే ఎంత బావుండేదోకదా" అన్నాను.

ఆమె చెప్పడం మొదలుపెట్టింది.

"నాకు బాబాఎదుట అన్నిమాటలు హృదయం విప్పిచెప్పడానికి సిగ్గుగా వుంది. నేను మొదట్లో నిన్ను అన్నయ్యా అని పిలిచాను. దానికి నిజంగానే నీవు కోప్పడ్డావు. అది నే కాదనను. ఎవరైనా పరాయిస్త్రీ వచ్చి అట్లా చొరవచేసుకుని మాట్లాడుతుంటే కోపం రాదనను. నీవు నిజంగా అన్నయ్యవే. మేమూమీరున్న వూళ్లోనే మీయింటికి రెండుమైళ్ల దూరంలో ఉండేవాళ్లం. నేను హెడ్మాష్టరుకూతుర్ని. మొదట్లో మా నాన్నావాళ్లు మీయింటిపక్కనే వుండేవారు. ఆ రోజుల్లో మాఅమ్మ నన్ను కన్నది. ఆమెకు కనంగానే గుర్రపువాతంవచ్చి చనిపోయింది. నేను పుట్టటం, మాఅమ్మ పోవటం ఒక్కసారి జరిగినై. అప్పట్లో నాతండ్రి బాబాయే. బాబా, హెడ్మాష్టరుగారూ చాలా అన్యోన్యంగా వుండేవారట. హెడ్—చెప్పారట—"మీఅమ్మాయిని మాయింట్లో వుంచండి. నా భార్య పెంచుతుంది." అంటే సరే అన్నాడు బాబా. వాళ్లింట్లో నే రెండుమూడేళ్లున్నానట. నేను చాలా అందంగా వుంటం చేత హెడ్మాష్టరుగారు "మాకిచ్చేసెయ్యండి పిల్లను. మేమే పెంచి చదువు చెప్పించి పెళ్లి చేస్తాం'"అన్నాట్ట. ఆ తరువాత ఎందుకో అక్కడినించి ఖాళీ చేశారు ఇల్లు. ఇంకా కొన్నాళ్లకుఅక్కణ్ణించి బదిలీ అయిపోయిందినాన్నకు. పదిపన్నెండేండ్ల పిల్లనైనాను. మళ్లీ ఈవూరే వచ్చాం. ఎక్కడో రెండుమైళ్ల దూరాన వున్నాం. అట్లా రెండు మూడు సంవత్సరాలు గడచినై. బాబా మళ్లీ ఎవరో బర్మాయువతిని పెళ్లి చేసుకున్నాడు నన్ను నాన్న కిచ్చిన నాలుగైదు నెల్లల్లో... ఆమే ఖుల్యాంబీ. నీవు స్కూల్లో చదువుతుండేవాడివి. అప్పుడప్పుడు హెడ్మాస్టరుగారితో మాట్లాట్టానికి గాని,

పుస్తకాలకు గాని వచ్చేవాడివి. ఎంతో వినయవిధేయతల్తో, భయంతోవుండేవాడివి. ఒకరోజున అడిగాను నాన్నని.—అబ్బాయి ఎవరని ? నీ విషయం చెప్తూ నేను తల్లిలేని పిల్లననీ, ఇంకా అన్నివిషయాలూ చెప్తూ వచ్చాడు. నీ వెప్పుడు వచ్చినా నీదగ్గరికి రావాలనీ కొగలించుకుందామనీ అనుకునే దాన్ని. నీవు పిలిస్తేనే సిగ్గుపడి వెళ్లిపోయేవాడివి. నీ మొగం వైపు కిటికీలోంచి బాగా చూసేదాన్ని. నీముఖం నాకు బాగా గుర్తు వుంది. అది అప్పటి విషయం...

మొన్న అందరూ రం— విడిచి వచ్చేటప్పుడు మేమూ వచ్చాం. కాదు నే నొక్కతెనే. బాంబులు పడ్డప్పుడు నాన్నా వాళ్లు తప్పించుకోలేక పోయినారు. ఇల్లు కూలిపోయి. భగవంతుడి దయవల్ల ఎంచేతనో నేను బ్రతికాను. నేనూ అందరితో పాటు వస్తున్నాను. నిన్ను రైల్లో చూశాను. ఆతరువాత ప్రో—స్టేషన్లో దిగినప్పుడు చూశాను. పలకరిద్దామనుకున్నాను. కాని నాముఖం మటుకు ఘోషా అయినందువల్ల చూపించలేక పోయినాను—"

ఇది వింటూన్న బాబాకు అప్రయత్నంగా రెండు కన్నీటి బిందువులు రాలినవి. నాకేమీ ఏడుపు రాలేదు. 'అమ్మదొంగా' అని ఫక్కున నవ్వుదామనుకున్నాను.

"అన్నయ్యా! నావంతై పోయింది. ఇహ బాబా చెప్పాలి" అన్న దామె.

"పిచ్చిపిల్లా, వాడు నీకు అన్నయ్య ఎట్లా అవుతాడు చెప్పు. ఇందాకటినించి పిలుస్తున్నావ్!" అన్నాడు బాబా.

ఆమె తెర తీసివేసింది. చెక్కిళ్లు నిమురుతూ అన్నాడు బాబా మళ్లీ — "పిచ్చిపిల్లా, వాడు నీకు అన్నయ్య ఎట్లా అవుతా"డని.

"అయితే పొరబాటే...నాకు తెలీక పిలిచానేమో ఎందుకో అన్నయ్యా అని పిలవబుద్ధయింది, పిలిచాను. ఎంతవారికైనా పొరపాట్లు తప్పవుకదా" అన్నది.

మళ్లీ చాలానేపటివరకూ ఏమీ మాట్లాడకుండానే సాగిపోయినాం!


## ఈశ్వర్స

## రత్నపురుష లేహ్యం

శుక్లనష్టము, మలబద్ధము, నరముల బలహీనత, నీరసము తగ్గించి, బలము, కండపుష్టి, రక్తము, వీర్యవృద్ధి నిచ్చును.

## గనోక్యేల్

అనిసెగలను అద్భుతముగ తగ్గించును. ఇతరౌషధములకు లొంబడని కేసులలోసహితము యిది కుదుర్చును, మూత్రనాళమందలి మంట, రసివంటి చెడ్డనీరు స్రవించుట అద్భుతముగ తగ్గించును.

## కుముద

స్త్రీల తెల్ల, ఎర్రకుసుమలు. అకాలబహిష్టు, బుతుశూల, వెన్నునొప్పి, గుండెనొప్పి తగ్గించును. బుతురక్తమును జారీచేయును. గర్భపాతమును కాకుండచేయును.

అన్ని గొప్ప మందులషాపులయందును దొరకును

ఈశ్వర ఫార్మసీ, మద్రాసు.



## అగ్ని, మోటారుకారు

## భీమాకు

↓

## యునైటెడ్ ఇండియా

ఫైర్ అండ్ జనరల్

ఇన్సూరెన్సు కంపెనీ లిమిటెడ్,

యునైటెడ్ ఇండియా లైఫ్ బిల్డింగు,

ఎస్ప్లనేడ్, మద్రాసు.

టెలిఫోన్ : 4241.

Grams : "UNIGEN"

పోస్టుబాక్సు : 1207.